క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మకు బోనాలు

జడ్చర్ల టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఒక్కొక్కరుగా వచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మేళతాళాలు, సంప్రదాయ వాయిద్యాలతో ఊరేగింపుగా బోనాలు తీసుకువచ్చి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

చిన్నచింతకుంట: దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలని కోరుతూ చిన్నచింతకుంట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ప్రజాదర్బార్‌ స్పెషల్‌ అధికారి దివ్యకు వినతిపత్రం అందజేశారు. కుమార్‌, కుర్మన్న, రమేష్‌, శ్రీనివాసులు, బాలు, కొండన్న, అలివేలమ్మ, మహేష్‌, మహేశ్వర్‌, సురేందర్‌, కార్తిక్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): హర్‌ఘర్‌ తిరంగాను విజయవంతం చేయాలని సంగీత నృత్య కాలేజీ ప్రిన్సిపాల్‌ రాఘవ్‌రాజ్‌ భట్‌ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే హర్‌ఘర్‌ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం భారత్‌ ఫోక్‌ ఆర్ట్‌ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. సంగీత, నృత్య కాలేజీ నుంచి తెలంగాణచౌరస్తా దాక ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్‌ హాల్‌లో విద్యార్థులచే దేశ భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చెక్కు అందజేత

అడ్డాకుల: మండలంలోని రాంచంద్రాపూర్‌కి చెందిన బి.రాములుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.60వేల చెక్కు మంజూరు కావడంతో.. కాంగ్రెస్‌ నాయకులు మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో గంగుల విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, సయ్యద్‌ షఫీ, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌కుమార్‌ రెడ్డి, పరుశరాములు ఉన్నారు.

హోమియో వైద్యంపై అవగాహన

జడ్చర్ల టౌన్‌: మండలంలోని ఆలూరు గ్రామంలో బాదేపల్లి ప్రభుత్వ హోమియో ఆస్పత్రి డా. వనజకుమారి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 78 మంది వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హోమియో వైద్యం గురించి అవగాహన కల్పించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా హోమియో వైద్యంతో వ్యాధులు నయం చేసుకోవచ్చని డా.వనజకుమారి సూచించారు. కార్యక్రమంలో డా.రాజేందర్‌, డా. సురేష్‌నాయక్‌, సిబ్బంది ఉత్తరయ్య, గణేష్‌, శివారెడ్డిలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: స్థానిక 26వ వార్డు పరిధిలోని హబీబ్‌ నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం మున్సిపల్‌ చైర్మన్‌ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను నాణ్యంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కాగా, పట్టణ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. డీఈఈ సందీప్‌, ఏఈ నుస్రత్‌, స్థానిక నాయకుడు మెహబూబ్‌ పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని జన శిక్షణ సంస్థాన్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ స్కీంలో భాగంగా రజకులకు మంగళవారం నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. అధ్యక్షుడు మల్లేష్‌ హాజరై ప్రసంగించారు. విశ్వకర్మ స్కీం ఎంతో మంది పేదల అభ్యున్నతికి దోహదం చేస్తోందన్నారు. సంస్థ డైరెక్టర్‌ సుబ్బారెడ్డి, రీసోర్సు పర్సన్స్‌ వసుంధర, శ్రీవాణి, వనజాదేవి, పండు, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిది

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వీకేర్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. మంగళవారం ఆ సంస్థ కార్యాలయంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు కచ్చితంగా ఒక మొక్కను నాటాలని అన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు రవికిరణ్‌, గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

కొత్తరుణాలపై అధికారుల తిరకాసు!

రాజాపూర్‌(బాలానగర్‌): రుణమాఫీ అయిన రైతులు కొత్త రుణాల కోసం వెళ్తే బ్యాంకు అధికారులు తిరకాసు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బాలానగర్‌లోని ఓ బ్యాంక్‌కు మొదంపల్లికి చెందిన బాల్యా అలియాస్‌ బాలు అనే రైతు వెళ్లాడు. తన రుణం మాఫీ కావడంతో తిరిగి క్రాప్‌లోన్‌ ఇవ్వాలని అధికారులను అడిగాడు. కాగా తన పేరు బాల్యా అలియాస్‌ బాలు ఉండటంతో రుణం ఇవ్వడం కుదరదని అధికారులు చెబుతున్నారని వాపోయారు. తనతో పాటు ఇలా మొదంపల్లి గ్రామానికి చెందిన మరో ఆరుగురు రైతులను, తిరుమలగిరికి చెందిన వారిని ఇలాగే రకరకాల తిరకాసులు పెట్టి బ్యాంకు చుట్టూ తిప్పుతున్నారని వాపోయారు.



బయటికి వచ్చిన విద్యార్థులు

తరగతి గదుల్లోకి వర్షం నీరు



గుడి మల్కాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల గదుల్లోకి చేరిన వర్షపు నీరు



పాఠశాల ప్రాంగణంలో పరిస్థితి ఇలా..

గుడి మల్కాపూర్‌ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఒక్కసారిగా కురిసిన వర్షం తరగతి గదుల్లో నీరు చేరింది. దీంతో అప్పటికే ప్రార్థన ముగించుకుని గదుల్లో కూర్చున విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఏమీ చేయలేని పరిస్థితిలో గదుల నుంచి బయటకు వచ్చి నిల్చున్నారు. కాగా కొందరు విద్యార్థులు తాము భోజనం చేయడానికి తెచ్చుకున్న ప్లేట్లు, గ్లాసులతో నీటిని తోడి బయటకు పారబోశారు. విషయం గమనించిన స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని వర్షపు నీరు బయటకు పంపించేందకు తమవంతుగా కృషిచేశారు. విషయంపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా.. అక్కడకు చేరుకుని పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులతో వర్షపు నీరు బయటికి పంపించేందుకు తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. ఇళ్ల మధ్య ఉన్న పాఠశాల భవనం చాలా పాతది కావడం.. చుట్టూ ఇళ్లన్నీ ఎత్తుగా నిర్మించుకోవడంతో.. ప్రస్తుతం బడి ఉన్న ప్రదేశం లోతట్టుగా మారిపోయింది. దీంతో వర్షపు నీరంతా పాఠశాలలోకి వస్తోంది. అధికారులు స్పందించి శాశ్వతంగా సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

- హన్వాడ

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిద్దాం



మాట్లాడుతున్న బాల మల్లేష్‌

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల శ్రేణులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్‌.బాల మల్లేష్‌ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో.. జిల్లా నిర్మాణ కౌన్సిల్‌ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యమాలలో అసువులు బాసిన అమరవీరులకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తుందని అన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఘర్షణకు కేంద్ర ప్రభుత్వమే ఆజ్యం పోస్తుందని మండిపడ్డారు. దేశంలో ఆకలి, నిరుద్యోగం పేదరికం అలాగే కొనసాగుతున్నాయని వాపోయారు. మానవ హక్కులు ప్రమాదంలో పడ్డాయని అన్నారు. తెలంగాణలో గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లా కార్యదర్శి బాలకిషన్‌, కార్యవర్గ సభ్యులు పి.సురేష్‌, కొండపల్లి రాము, అల్వాల్‌ రెడ్డి, గోవర్ధన్‌, ఎస్‌.శంకర్‌ నాయక్‌, చాంద్‌ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ ఎదుట ఆందోళన



కంపెనీ ఎదుట బైఠాయించిన కార్మికులు

మహమ్మదాబాద్‌: యాజమాన్యం, పార్ట్‌నర్స్‌కు కుదరకపోవడంతో చిన్నపాటి అంతర్గత గొడవలతో ఫార్మా కంపెనీ మూతపడటంతో తాము రోడ్డున పడాల్సివస్తోందని కార్మికులు వాపోతున్నారు. మంగళవారం కంపెనీ దగ్గరికి వెళ్లి ఆందోళన చేపట్టారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా కంపెనీ మూసేయడం ఏమిటని ప్రశ్నించారు. వారి కథనం ప్రకారం.. మండల పరిధిలోని నంచర్లగేట్‌ దేశాయిపల్లి దగ్గర మినీ ఇండస్ట్రీని ఏర్పాటు చేశారు. దీంట్లో భాగంగా రెండు సంవత్సరాల క్రితం ఫార్మాకంపెనీ ఏర్పాటు చేశారు. కాగా కార్మికులు రెండేళ్లుగా పని చేస్తున్నా నగదు వేతనం చెల్లించి ఎలాంటి పీఎఫ్‌, ఈఎస్‌ఐ సౌకర్యాలు లేకుండా చేశారు. ఇతర కంపెనీ వారికి అమ్ముకున్నా.. తాము దాంట్లో పని చేసేందుకు తగిన ఆధారాలు కూడా వేతనం పేస్లిప్పులు కూడా ఇవ్వలేదు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గమనించి కార్మికులకు అదే కంపెనీలో పనిచేసేందుకు తగిన అవకాశం కల్పించాలని కోరారు.

రాంరెడ్డిగూడెంలోని రెసిడెన్షియల్‌ స్కూల్‌ పరిశీలన



రాంరెడ్డిగూడెంలోని ఫిల్టర్‌బెడ్‌ వద్ద సంప్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ బస్వరాజ్‌

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: సమీపంలోని ఈతవానికుంట ఊట కారణంగానే రాంరెడ్డిగూడెంలోని రెసిడెన్షియల్‌ స్కూల్‌, హాస్టల్‌ పరిసరాల్లో నీరు నిలుస్తున్నట్లు అధికారులు తేల్చారు. కాగా, ఇక్కడికి ఫిల్టర్‌బెడ్‌ నుంచి వృథాగా నీరు వస్తోందని పాఠశాల ప్రిన్సిపాల్‌ వాణిశ్రీ ఇటీవల కలెక్టర్‌ విజయేందిర బోయికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈ పుల్లారెడ్డి, మహబూబ్‌నగర్‌ రూరల్‌ తహసీల్దార్‌ సుందర్‌రాజ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ డి.మహేశ్వర్‌ రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్‌, ఏఈ నుస్రత్‌ తదితరులు పరిశీలించారు. అలాగే పక్కనే ఉన్న ఫిల్టర్‌ బెడ్‌ వద్ద సంప్‌ను సైతం తనిఖీ చేశారు. ఇది ఓవర్‌ఫ్లో కాకుండా చూస్తామని మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ అధికారులు పాఠశాల ప్రిన్సిపాల్‌ వాణిశ్రీకి చెప్పారు.

బంగ్లాదేశ్‌లో దాడులకు నిరసనగా బంద్‌



జడ్చర్లో ర్యాలీలో పాల్గొన్న ఆయా సంఘాల నాయకులు

జడ్చర్ల టౌన్‌: బంగ్లాదేశ్‌ హిందువులు, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ మంగళవారం హిందు ఐక్యసంఘాల ఆధ్వర్యంలో జడ్చర్లలో బంద్‌ నిర్వహించారు. నేతాజీ చౌరస్తా నుంచి నిమ్మబావిగడ్డ, హౌజింగ్‌బోర్డు కాలనీ, కావేరమ్మపేటల నుంచి తిరిగి నేతాజీ చౌరస్తా వరకు హిందూ సంఘాల నాయకులు ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్‌ కళాశాలలు బంద్‌ చేయించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

చిన్నచింతకుంట: మండలకేంద్రంలో హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్‌ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్‌ సమీపంలో నిరసన తెలిపారు.

హన్వాడ: మండలపరిధిలోని పెద్దర్పల్లిలో మంగళవారం బంద్‌ నిర్వహించారు. బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్‌ తదితరులు పాల్గొని మాట్లాడారు.

గండీడ్‌: మండల కేంద్రంలో ధార్మికసంస్థ, హిందూసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌ నాగలక్ష్మికి వినతిపత్రం అందించారు. శ్రీనివాసులు, ఏపీ రాములు, అంజిలయ్య, వెంకటేశం, విజయ్‌కుమార్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శంకర్‌నాయక్‌, లక్ష్మయ్య, కృష్ణయ్య, చిన్నయ్య, మల్కయ్య తదతరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలకేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌ ప్రశాంతగా ముగిసింది. బీజేపీ మండల అధ్యక్షుడు యాదిరెడ్డి, రాములుగౌడ్‌, నర్సిములు, టైలర్‌ వడెన్న తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో బైక్‌ ర్యాలీ..



చిన్నచింతకుంటలో..

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం బంద్‌ ప్రశాంతంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, సుధాకర్‌రెడ్డి, దేవన్నసాగర్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, సత్యనారాయణ, హరిబాబు ఇంకా పలువురు పాల్గొన్నారు.

ఇసుక వాహనం సీజ్‌

మహబూబ్‌నగర్‌ క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న భారత్‌ బెంజ్‌ వాహనాన్ని పోలీసులు సీజ్‌ చేశారు. రూరల్‌ ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ మాట్లాడుతూ.. ఆంజనేయులు అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా భారత్‌ బెంజ్‌ వాహనంలో ఇసుక తరలిస్తూ జేపీఎన్‌సీఈ దగ్గర చేసిన తనిఖీల్లో పట్టుబడ్డట్లు వివరించారు. ఈ మేరకు వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

మహబూబ్‌నగర్‌ క్రైం: ఇంటి నుంచి కళాశాలకు వచ్చిన ఓ విద్యార్థిని కన్పించకుండా పోయింది. టూటౌన్‌ ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్‌ జిల్లాకు చెందిన 17ఏళ్ల అమ్మాయి పట్టణంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం నాగర్‌కర్నూల్‌ నుంచి మహబూబ్‌నగర్‌కు కళాశాలకు అని చెప్పి వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకోకపోవడంతో దీంతో కుటుంబ సభ్యులు కళాశాలతో పాటు బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు



జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): చదువుకు పేదరికం అడ్డు కాకూడదని సింహగిరి కౌన్సిలర్‌ కోట్ల నర్సింహ్మ అన్నారు. కాలనీకి చెందిన నాయి బ్రాహ్మణ బిడ్డ భాగ్యలక్ష్మి నీట్‌లో మంచి ప్రతిభ కనబర్చిందన్నారు. మంగళవారం కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో ఆమెను సన్మానించారు. ఆర్థికసాయం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులను సన్మానించారు. అధ్యక్షుడు రుద్రారం సత్యం, ప్రధాన కార్యదర్శి మల్లెపల్లి అశ్విని నరసింహులు, సింహగిరి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, కోశాధికారి ఎం సుధాకర్‌, తంగడపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌ ప్లాట్లను శుభ్రం చేయించుకోవాలి

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: పట్టణంలోని ఓపెన్‌ ప్లాట్లను వాటి యజమానులే చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయించుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ డి.మహేశ్వర్‌రెడ్డి మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే దోమల బారి నుంచి బయట పడవచ్చన్నారు. ఇప్పటికైనా ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు స్పందించకుంటే మున్సిపాలిటీకి రూ.ఐదు వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

పాలమూరు: ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఏర్పాటు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్‌ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

దేవరకద్ర: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్‌ ఘర్‌కి తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగువేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య ఒక ప్రకటనలో కోరారు. జాతీయ పతాకాలను దేవరకద్ర పోస్టాఫీసులో కేవలం రూ. 25 లకే విక్రయిస్తున్నారని వివరించారు.

విద్యార్థులకు సన్మానం

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ఇటీవలే హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ ఇండోర్‌ స్టేడియంలో జరిగిన ఇంటర్‌నేషనల్‌ కరాటే టోర్నీలో బంగారు పతకం సాధించిన స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల విద్యార్థి మారియబేగంను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్‌ కౌసర్‌ జహ అభినందించి శాలువాతో సత్కరించారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థి పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్‌ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో బీఏ చదివి పీజీ ఎంట్రన్స్‌ హిందీలో రాష్ట్రస్థాయిలో 13వ ర్యాంక్‌ సాధించిన ఆసీఫ్‌ను మంగళవారం కళాశాల ప్రిన్సిపల్‌ డా.సుకన్య తన చాంబర్‌లో సత్కరించి అభినందించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె సూచించారు. పూర్వ ప్రిన్సిపల్‌ డా. అప్పియాచిన్నమ్మ, హిందీ విభాగం అధ్యక్షుడు డా.నర్సింహరావు కల్యాణి అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన డా. అప్పియాచిన్నమ్మను వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రస్తుత ప్రిన్సిపల్‌ డా. సుకన్య, అధ్యాపకులు సదాశివయ్యలు ఆమెను శాలువా, పూలబొకేతో సత్కరించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో జహంగీర్‌బాబా

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అల్‌ఫైజ్‌ వెల్ఫేర్‌ సొసైటీ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా మాట్లాడుతూ గత 27 ఏళ్ల నుంచి కులమతాలకతీతంగా ప్రజా సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ తన సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చదువుకు సంబంధించిన వస్తు సామాగ్రితోపాటు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్‌ యాఖూబ్‌, ముబీన్‌ఖాన్‌, మహబూబ్‌అలీ జవాద్‌ తదితరులు పాల్గొన్నారు.

రుద్రారంలో టీబీ వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవాబుపేట: రుద్రారంలో మండల వైద్యాధికారి డాక్టర్‌ నవీన్‌చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం టీబీ ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. రుద్రారం హెల్త్‌ వెల్‌నెస్‌ సెంటర్‌ పరిధిలోని గ్రామాల్లో అనుమానితులకు టీబీ పరీక్షలు చేశారు. వీరిలో 17 మందికి క్లో పరీక్షలు సైతం చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌శ్రీజా, జయశ్రీ, ఎంపీహెచ్‌ఓ శ్రీనివాస్‌లు, శరభలింగం, భవానీ, బాల్‌రాజ్‌, మాధవి, రజిత, ఆశ కార్యకర్తలు పద్మ, లక్ష్మి, జ్యోతీ,అరుణ, గీత తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి నరేందర్‌

రాజాపూర్‌: వరిలో నారుమడి నుంచి ఈనే దశ వరకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని.. కాండం తొలుచు పురుగు నివారణ మెళకువలు పాటించాలని.. మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్‌ సూచించారు. మంగళవారం రంగారెడ్డిగూడ, కల్లేపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. వివిధ సూచనలు చేశారు. రైతులు మల్లయ్య, యాదయ్య, వెంకట్‌రెడ్డిలతో పాటు ఏఈఓలు మేఘనాథ్‌, శ్రీనివాస్‌ ఉన్నారు.

వైద్యురాలికి కొవ్వొత్తులతో నివాళి



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

జడ్చర్ల టౌన్‌: ఆర్‌జీకేఏఆర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో యువవైద్యురాలిని కిరాతకంగా హతమార్చటాన్ని ఖండిస్తూ మంగళవారం రాత్రి జడ్చర్ల ఐఎంఏ ఆధ్వర్యంలో క్యాండిల్‌ ర్యాలీ నిర్వహించారు. సిగ్నల్‌గడ్డ నుంచి నేతాజీచౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు 24గంటల ఆస్పత్రిలో రక్షణకల్పించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీఎం అండ్‌హెచ్‌ఓ డా.శ్రీధర్‌రెడ్డి, డాక్టర్లు పెరుమాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సుజీత్‌కుమార్‌, శివకాంత్‌, సునీల్‌ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు సాధించుకుందాం



ధర్నా చేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): క్విట్‌ ఇండియా ఉద్యమస్ఫూర్తితో పోరాటం చేసి కార్మికుల హక్కులను సాధించుకుందామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ చౌరస్తాలో జరిగే బుధవారం రాత్రి జరిగే జనజాగరణకు అధిక సంఖ్యలో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌ యార్డు కార్యాలయం ఎదుట కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహించారు. నాయకులు వరదగాలన్న, ముక్తార్‌ ఖాన్‌, నసీర్‌, ఎర్ర నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలపై శ్రద్ధ అవసరం



యూనిఫాం అందుకుంటున్న చిన్నారులు

అడ్డాకుల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై సిబ్బంది శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్‌ సీడీపీఓ అరుణ సూచించారు. మూసాపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు హెచ్‌బీఎల్‌ పవర్‌ సిస్టమ్స్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో సపోర్టు సర్వీసెస్‌లో సహకారం అందజేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కంపెనీ ఆధ్వర్యంలో పిల్లలకు ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫాంలను అందజేశారు. అదేవిధంగా పిల్లలకు పాలు, వేరుశనగ పట్టీలు, అరటి పండు ఇచ్చే విధంగా సహకారం అందిస్తున్నారు. వంటగది సామాన్లు, పాలు తాగేందుకు కప్పులను అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ అరుణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సాయం అందిస్తున్న హెచ్‌బీఎల్‌ కంపెనీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ అనురాధ, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ అనసూయ, కార్యదర్శి మహేందర్‌, కంపెనీ నిర్వాహకుడు యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుతో మున్సిపల్‌ కార్మికుల నిరసన



వంటావార్పులో పాల్గొన్న కార్మికులు

జడ్చర్ల టౌన్‌: సమస్యల పరిష్కారం కోసం 8 రోజులుగా చేస్తున్న ఆందోళనలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కార్మికులు వంటావార్పు చేపట్టారు. కాంట్రాక్ట్‌ ఔట్‌సోర్సింగ్‌, శానిటేషన్‌ కార్మికులు, ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి సామాజికవేత్త అనిల్‌కుమార్‌ హాజరై సంఘీభావం తెలిపారు. మున్సిపల్‌ ఎంప్లాయిస్‌ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్‌ మాట్లాడారు. తమ ఆందోళనలను కొందరు కౌన్సిలర్లు తప్పుపట్టడం సబబు కాదని, ఏళ్లతరబడి సమస్యలు పరిష్కారం కాకుండా ఉండటంతోనే తాము ఆందోళన చేపట్టామన్నారు. తమ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వంటావార్పు కార్యక్రమంలో మున్సిపల్‌ కార్మికులు మహేష్‌, కేశవులు, నరసింహ్మ, అంజమ్మ, అలివేలు, యాదమ్మ, శివకుమార్‌లు పాల్గొన్నారు.